క్లుప్తంగా

పీరీల ఊరేగింపు



కాజీపేట: కాజీపేట పట్టణంలోని వీధుల్లో ముతావళి అమ్మూబాయ్ ఆధ్వర్యంలో గురువారం పీరీల ఊరేగింపు కొనసాగింది. కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మరణించిన వారి జ్ఞాపకార్థం పది రోజులు శోక (సంతాప) దినాలుగా ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. కులమతాలకు అతీతంగా ముస్లింలు పీరీలను కాలనీల్లో ఊరేగించడంతో పాటు వారు సమర్పించే కానుకలు స్వీకరిస్తుంటారు.

డేటా ఇంజనీర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

హన్మకొండ కల్చరల్: శ్రీసత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగుల కోసం ఉచిత డేటా ఇంజనీర్ కోర్సును శ్రీసత్యసాయి సేవాసంస్థ ఉచితంగా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో ఆఫ్‌లైన్‌లో తరగతులు జరగనున్నాయని పేర్కొన్నారు. బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ పూర్తిచేసిన వారు అర్హులని, ఆసక్తి గలవారు 90523 72023 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు బేసిక్ అండ్ అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్‌క్యూఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

బాధితుడికి పర్సు అప్పగింత



కాజీపేట: కాజీపేట పట్టణంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును ట్రాఫిక్ పోలీసులు తిరిగి అప్పగించిన ఘటన గురువారం జరిగింది. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న కథనం ప్రకారం డీ మార్ట్ వద్ద గురువారం విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ అక్బర్ పాషాకు పర్సు కనిపించింది. అందులో రూ.6వేల నగదు, ఆధార్ కార్డు, ఏటీఎంలు ఉన్నాయి. పర్సులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి ప్రభుత్వ ఉద్యోగి కమాని ప్రదీప్‌కు పర్సును అందజేశారు.

ట్రాన్స్‌కో డైరెక్టర్‌కు శుభాకాంక్షలు



హన్మకొండ: టీజీ ట్రాన్స్‌కో డైరెక్టర్ శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శశికుమార్, కోశాధికారి డి.రాజయ్య, ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు రావుల రమణారెడ్డి, ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ కార్యదర్శి విజయ్ కుమార్, నాయకుడు ఉపేందర్ పాల్గొన్నారు.

ఎంఈఓకు అభినందన

రామన్నపేట: వరంగల్ మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.మురళిని వడుప్సా వరంగల్ జోన్ అధ్యక్షుడు కూచన క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వడుప్సా (ట్రిస్మా) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆడెపు శ్యామ్, జిల్లా కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర సింగ్, జిల్లా సలహాదారులు శ్రీధర్, చక్రపాణి, బాధ్యులు ఆడెపు వెంకటేశ్వర్లు, మడిపెల్లి రాజు, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



హన్మకొండ: డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. హనుమకొండ స్నేహనగర్‌లోని రోడ్డు నంబర్ 2, 3లలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. రోడ్డు పనులను నాణ్యతతో త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు డివిజన్‌లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు నంబర్ 19లో సైడ్ డ్రైన్, సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనా వేయించినట్లు తెలిపారు. డివిజన్‌లో చెత్త సేకరణ, తరలింపునకు కేటాయించిన నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేందర్ రెడ్డి, కార్పొరేషన్ డీఈ సారంగపాణి, ఏఈ మేనక, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, స్నేహనగర్ అధ్యక్షుడు నర్సింహారావు పాల్గొన్నారు.

ప్లాట్లుగా పంట పొలాలు



నగరంలో వెలిసిన రియల్ ఎస్టేట్ వెంచర్



మడికొండ శివారులో ప్లాట్లుగా మారిన వ్యవసాయ భూములు



కాల్వను ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

- గ్రేటర్ వరంగల్‌లో పెరిగిన రియల్ దందా
- వ్యవసాయ భూముల్లో వెలుస్తున్న వెంచర్లు
- కాల్వలనూ వదలని వ్యాపారులు

మడికొండ: హనుమకొండ మండలంలోని శివారు గ్రామాల్లో వ్యవసాయ పొలాలు కాస్త ప్లాట్లుగా మారుతున్నాయి. వ్యవసాయ భూములను రైతుల నుంచి కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమ్మకాలు చేస్తున్నారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా చేస్తూ లేఅవుట్ చేసినట్లు చూపిస్తూ, దిగువ, మధ్య తరగతి ప్రజలను ఆశ పెడుతున్నారు. అధికారులు సైతం మిన్నకుండి చూస్తూ, సామాన్య ప్రజలు కొనుగోలు చేశాక అనుమతుల కోసం వెళ్తే లేఅవుట్ లేదని చెపుతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందుగానే రియల్టర్లపై చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రియల్టర్లు ఇచ్చే మాముళ్ల మత్తులో అధికారులు జోగుతున్నారని ఆరోపిస్తున్నారు.

నగర శివారు గ్రామాల్లో వెలుస్తున్న వెంచర్లు

నగర విస్తీర్ణం పెరగడంతో శివారు గ్రామాలైన మడికొండ, రాంపూర్, కడిపికొండ, భట్టుపల్లి, మామునూరు, తిమ్మాపూర్, నక్కలపల్లి, ధర్మసాగర్ తదితర గ్రామాల్లో ఎక్కువగా వెంచర్లు చేయడానికి రియల్టర్లు ఆసక్తి చూపుతున్నారు. ఈ గ్రామాల్లో ఎకరాకు సుమారుగా రూ.50 లక్షల నుంచి రూ.90 లక్షలు వరకు ధర పలుకుతోంది. ఎక్కడో ఒక చోట తక్కువ ధరకు ఎకరం కొనుగోలు చేసి చుట్టుపక్కల రైతులను మచ్చిక చేసుకుని రియల్ వ్యాపారులు ఆ భూములను కూడా ప్లాట్లుగా మారుస్తున్నారు. కొంతమంది రియల్టర్లు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి పక్కన ఉన్న రైతులకు దారి లేకుండా చేస్తూ వారి భూములను సైతం అమ్మేవిధంగా ఇబ్బందులు గురిచేస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, కొంతమంది రైతులు చెరువు శిఖం, కాలువలను కబ్జా చేసి ఎక్కువ భూమి చూపెడుతూ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. కొంతమంది రైతులు పక్క పొలంలోకి వెళ్తూ హద్దురాళ్లను తొలగించి వారికి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అలాంటి వారిపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకుని, తమ భూములకు దారి ఉండేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రియల్టర్లకు వరంగా బీడు భూములు

నగర శివారు గ్రామాల్లో ఉన్న పంట పొలాలు రియల్టర్లకు వరంగా మారుతున్నాయి. పట్టా పాస్‌బుక్కులు లేకున్నా తాము చేయించుకుంటామని రైతులకు నచ్చజెప్పి పట్టాకు ఇంత ఖర్చు అవుతుందంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. కొంతమంది తమ తాతలు, తండ్రులు అమ్మిన భూములకు ఇప్పుడు ధరలు పెరగడంతో భూమిలో తమకు వాటా వస్తోందని కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. ఇరువై ఏళ్ల క్రితం కొన్న భూమి ఇప్పుడు తమది అంటూ రావడంతో సాగులో ఉన్న రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయయోగ్యం కాని బీడు భూములపై రియల్టర్లు కన్నేసి ఎంతోకొంత రేటుకు కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయంపై ఇష్టం లేని రైతులను ఎంపిక చేసుకుని ఒకటికి పదిసార్లు వారి ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వారిని బోల్తా కొట్టిస్తున్నారు. దీంతో వ్యవసాయం చేసుకునే రైతులకు ఇబ్బందిగా మారుతోంది. అనేక ఏళ్ల నుంచి ఉన్న బాటలను రియల్టర్లు కబ్జా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

సాదా బైనామా వర్తింపజేయాలని వేడుకోలు

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాదా బైనామాలో నగరంలోని విలీన గ్రామాల భూములకు అవకాశం కల్పిస్తే ఆయా గ్రామాల రైతులకు లాభం జరుగుతుందని ప్రజలు అంటున్నారు. భూముల ధరలు పెరగడంతో ఎవరు కాస్తులో ఉంటున్నారో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు. కొన్నేళ్ల క్రితం కొన్న భూములకు పట్టాలను ఇస్తే దళారులకు డబ్బు ఇవ్వకుండా ఉంటుందని విలీన గ్రామాల రైతులు కోరుతున్నారు.

కాల్వలను ఆక్రమిస్తున్న రియల్ వ్యాపారులు

కొంతమంది రియల్ వ్యాపారులు కాల్వలు, కాల్వలను కబ్జా చేస్తూ తమ వెంచర్లలో కలుపుకుంటున్నారు. ఈ క్రమంలో వర్షాకాలంలో చెరువు నిండి మత్తడి నీరుకు వెళ్లే దారి లేక సమీపంలోని ఇళ్లలోకి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. నాలాలను ఆక్రమిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దరఖాస్తులు జాగ్రత్తగా పరిశీలించాలి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

హసన్‌పర్తి : వివాదస్పదమైన భూములకు సంబంధించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని ఆదేశించారు. మండలవ్యాప్తంగా భూభారతి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఏ విధంగా పరిశీలిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా మ్యూటేషన్, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలో రైతుల నుంచి వచ్చిన సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ప్రస్తుతం నగరంలో సాదాబైనామాకు ఎలాంటి అనుమతి లేదన్నారు. తహసీల్దార్ చల్లా ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రహీం, ఆర్ఐ ఫాజిల్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సురేష్‌లాల్



అభినందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్‌గా, ఆర్ట్స్ విభాగం డీన్‌గా ఎకనామిక్స్ విభాగం ప్రొఫెసర్ సురేష్‌లాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనను ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వెంకటేశ్వర్లు, బాధ్యులు, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ జెట్టి రాజేందర్, డాక్టర్ సదాశివ్, డాక్టర్ మంజుల శ్రీనివాస్, అనిల్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిరావాలి



సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

హన్మకొండ చౌరస్తా: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం తలపెట్టిన సంవిధాన్ పరిరక్షణ శంఖారావం సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు సత్యనారాయణ, శ్రీనుబాబు, శ్రీనివాస్‌గౌడ్, ధర్మారావు పిలుపునిచ్చారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తెలంగాణ పక్షాన ఘన స్వాగతం పలుకుదామని అన్నారు. పార్టీ కార్యకర్తలను హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు భద్రతో కూడిన వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఈవీ శ్రీనివాసరావు, బత్తిని శ్రీనివాసరావు, అజీజ్‌ఖాన్, బొమ్మతి విక్రమ్, తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, తాడిశెట్టి విద్యాసాగర్, స్వామిచరణ్, సురేందర్, సంపత్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ వద్దంటూ ఆందోళన



నిరసన తెలుపుతున్న స్థానికులు

హన్మకొండ చౌరస్తా: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మించొద్దంటూ స్థానికులు గురువారం ఆందోళన చేశారు. హనుమకొండ సుధానగర్‌లోని ఓ ఇంటిపై సెల్ టవర్ నిర్మిస్తున్నారంటూ ఇంటి యజమానితో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారులు స్పందించి టవర్ నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న కేడెట్లతో అధికారులు

విద్యారణ్యపురి: కోర్సు పూర్తి చేసిన ఎన్‌సీసీ కేడెట్లకు హనుమకొండలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. క్రమశిక్షణతో పాటు దేశభక్తి పెంపొందించడంలో ఎన్‌సీసీ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని హైస్కూల్ పీజీహెచ్‌ఎం జీవీ.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లను ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ వాసు, ఎన్‌సీసీ అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. సర్టిఫికెట్లు పొందిన కేడెట్లకు పాలిటెక్నిక్, ఇతర కోర్సుల్లో సీట్లు లభించాయని ఎన్‌సీసీ అధికారి తెలిపారు.

కూరగాయల వ్యాపారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మార్కెట్ వ్యాపారులు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని వెంకటలక్ష్మి కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులు దుకాణాలు బంద్ చేసి మార్కెట్ ఆవరణలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా పట్టణ రహదారులపై కొంతమంది చిరు వ్యాపారులు కూరగాయలు విక్రయిస్తుండటం వల్ల మార్కెట్‌లో అమ్మకాలు సాగడంలేదని అన్నారు. మార్కెట్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నిషాని భిక్షపతి, గౌరవ అధ్యక్షుడు నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులను వ్యాపారులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండీ.చాంద్‌పాషా, ఏసు, కళమ్మ, స్వరూప, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన



చేనేత వస్త్ర ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కాజీపేట: కాజీపేట నిట్ ప్రధాన రహదారిపై ఉన్న తారా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాలు, హస్తకళల ప్రదర్శన కేంద్రం కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న చేతివృత్తుల వారు నిర్వహించే స్వదేశీ కళలకు సంబంధించిన ప్రత్యేక స్టాళ్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. పట్టు చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఒరిస్సా టై, డై దుస్తులు, ఒరిస్సా చీరలు, పశ్చిమ బెంగాల్ కాటన్ చీరలు సందర్శకులను ఆకర్శిస్తున్నాయి. రాజస్థాన్ కళాఖండాలు ఆకట్టుకుంటున్నాయి.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భుజేందర్ రెడ్డి

రామన్నపేట: రోజువారి జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, పర్యావరణాన్ని కాపాడుకుందామని ఏవీవీ కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ బ్యాగులు వద్దు.. గుడ్డ సంచులు, టిఫిన్ బాక్స్‌లే ముద్దు' అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణ, ముఖ్యంగా కాలువలు, చెరువులు, నదులు కలుషితమవుతున్నాయని, అలాగే, జంతువులు, పక్షులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ విధిగా బట్ట సంచులు, టిఫిన్ బాక్స్‌లను ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనిత, సంజీవ, నవీన్, సంధ్యారాణి, రమాదేవి, శ్రీకాంత్, వలంటీర్లు దేవిశ్రీప్రసాద్, సాకేత్, క్రాంతి, సాత్విక్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



విద్యార్థినికి అడ్మిషన్ ఫాం అందజేస్తున్న హైదర్

న్యూశాయంపేట: ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కేఏ.గౌస్ హైదర్ సూచించారు. హంటర్‌రోడ్డులోని హనుమకొండ (జీ1) మైనార్టీ బాలికల గురుకులాన్ని గురువారం ఉదయాన్నే సందర్శించారు. ప్రిన్సిపాల్ నీరజ, విద్యార్థినులతో కలిసి అసెంబ్లీలో పాల్గొన్నారు. విద్యార్థినులతో ముచ్చటించి అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. సర్కారు అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం గురుకులం అధ్యాపకులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సమష్టిగా కృషిచేయాలని అన్నారు. హనుమకొండ రాయపురకు చెందిన విద్యార్థినికి 5వ తరగతిలో అడ్మిషన్ ఫామ్ అందజేసి ప్రవేశం కల్పించారు.

విద్యార్థులకు దాతల సహకారం



విద్యారణ్యపురి: షూ పంపిణీ చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



హసన్‌పర్తి: విద్యార్థులకు వర్క్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆడెపు శ్రీకాంత్ సహకారంతో హనుమకొండలోని లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో పలువురు విద్యార్థినులకు ఎంఈఓ నెహ్రూనాయక్ గురువారం షూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు జిలుకర ఏకాంతం, ఎండీ.సలీమ్, శైలజ, జ్యోతి, సత్యవతి పాల్గొన్నారు.

వర్క్ బుక్స్ పంపిణీ

హసన్‌పర్తి: 65వ డివిజన్ ఎల్లాపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వర్క్‌బుక్స్ పంపిణీ చేశారు. నిరూప్‌నగర్ తండా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఎ.శోభారాణి సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంపత్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దాతలు ముందుకు వచ్చి నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాకృష్ణ, పెద్దమ్మ నాగరాజు, ప్రభావతి పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న వెంకట్రామ్ నర్సింహారెడ్డి

హసన్‌పర్తి: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 వేల మంది గ్రామస్థాయి నేతలతో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ మదన్‌గౌడ్, భగత్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్, దేవస్థాన ధర్మకర్త సురేష్, మాజీ ఉపసర్పంచ్ రాజు, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యాసంస్థల బంద్

విద్యారణ్యపురి: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్‌ను నిర్వహించారు. 48గంటల పాటు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చిన నాయకులు.. హనుమకొండలో తిరుగుతూ గురువారం పలు కళాశాలల బంద్ జరిగేలా చూశారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సారయ్య మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో భరత్, బైరేష్, రంజిత్, గౌరీశంకర్, దుర్గేశ్, సందీప్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

హసన్‌పర్తి: అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీ కడియం కావ్య అన్నారు. 55వ డివిజన్ భీమారంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన బీసీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్‌కార్డుల ద్వారా సన్నరకం బియ్యాన్ని అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మార్క రాజు, దేవస్థాన మాజీ చైర్మన్ వెంకటస్వామి, దేశిని వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధిస్తే సైకిల్ గిఫ్ట్

కాజీపేట అర్బన్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు సైకిల్ గిఫ్ట్‌గా అందజేస్తానని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు తెలిపారు. 2024 – 25వ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 17 మంది విద్యార్థులను న్యూశాయంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన సన్మానించి, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళ, ఉపేందర్‌రెడ్డి, తిరుపతి, విక్రమ్, రామకోటి, రవీందర్ రాజు, చంద్రమోహన్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సప్తాహం ప్రారంభం

హన్మకొండ అర్బన్: నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో చిన్మయి మిషన్ వరంగల్ ఆధ్వర్యంలో యజ్ఞానంద స్వామి ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు నిర్వహించనున్న జ్ఞాన సప్తాహం కార్యక్రమాన్ని మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ గురువారం ప్రారంభించారు. ఏడు రోజుల పాటు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు కైవల్యోపనిషత్‌లపై ప్రవచన కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు ఆచార్య బ్రహ్మచారిణి లతికా చైతన్య తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు వెయ్యిగండ్ల రమేష్, పూస సురేష్, నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

రామన్నపేట: నగరంలోని ఎల్లమ్మ బజార్‌లోని సాయి సేవాదళ్ భజన మందిరంలో సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో ఈనెల 10న నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకల వాల్‌పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ డీసీపీ రాయల ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయి సేవాదళ్ అధ్యక్షుడు ఆరుట్ల శ్రీనివాస్, సభ్యులు పోలా మహేష్, మన్నవ మోహన్‌కృష్ణ, ఇరుకుల్ల నాగేశ్వర్‌రావు, రవీంద్రచారి, స్వరాజ్య బాబు, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్' ఫీజుల దోపిడీని అరికట్టాలి

హన్మకొండ కల్చరల్: రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఖిలా వరంగల్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నాయకుడు శివకుమార్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో శరత్ మాట్లాడారు. రాష్ట్రంలో పేదవారికి విద్య అందని ద్రాక్షగా మారిందని వాపోయారు. విద్యను కార్పొరేట్ సంస్థలు అంగడి సరుకుగా మార్చాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్, ప్రశాంత్, సోను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాటివనాన్ని కాపాడాలని వినతి



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని తాటి వనానికి ఎలాంటి నష్టం కలగకుండా లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని గౌడ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాస్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. నూతనంగా స్తంభాలు వేసి లైన్ వేయడం వల్ల తాటి చెట్లకు జరుగుతున్న నష్టంతో పాటు గీత కార్మికులు ఉపాధి కోల్పోతున్న విధానాన్ని వివరించారు. సంఘం అధ్యక్షుడు బొల్లికొండ యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, కోశాధికారి బుర్ర బాబురావు, సభ్యులు బొల్లెపల్లి శేఖర్ గౌడ్, మోడెం రాజేష్, మోడెం రమేష్, నాగపురి రాంకీ, ఎస్.రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.